క్లుప్తంగా

ఘనంగా పౌష్టికాహార వారోత్సవాలు



మైనంపాడులో పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): మండలంలోని పలు గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. గురువారం చిలకపాడు, మైనంపాడు గ్రామాల్లో పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సావిత్రి మాట్లాడుతూ ఆహార తీసుకునే క్రమంలో ఆకుకూరలు, కూరగాయలు, ఉండేలా చూసుకోవాలని చెప్పారు. తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలు కలిగిన ఆహారం సమపాళ్లలో అందిస్తే ఎదుగుదల ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందించాలని తెలిపారు. సూపర్‌వైజర్ పార్వతి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న డాక్టర్ నాగరాజు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): ప్రతి ఒక్క విద్యార్థి ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్ నాగరాజు అన్నారు. గురువారం మైనంపాడు డైట్ కాలేజీలో సంతనూతలపాడు ప్రభుత్వ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. మెడికల్ క్యాంపును డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సోమా సుబ్బారావు ప్రారంభించారు. మెడికల్ క్యాంపులో 143 మందికి చికిత్స అందించారు. అందరికీ బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. మైనంపాడు సర్పంచ్ డి.రమణ, ఉప సర్పంచ్ జి.సుబ్బారావు, డైట్ అధ్యాపకులు పాల్గొన్నారు

ఘనంగా సిద్ధి బుద్ధి వినాయక కళ్యాణ మహోత్సవం



ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన గణపతి

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద గురువారం రాత్రి సిద్ధి బుద్ధి వినాయకుని కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపం కమిటీ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి వేడుకల తొమ్మిదో రోజులో భాగంగా సిద్ధి బుద్ధి వినాయకుని కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు నేలబట్ల శ్రీనివాస్వర్మ ఆధ్వర్యంలో వేద పండితులు గూడ సాయిరాం, పర్యవేక్షణలో పండితులు శ్రీధర్ రామ్మూర్తి శర్మ, వి.సుబ్రహ్మణ్యం శర్మ తదితరులు కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపం కమిటీ అధ్యక్షుడు వేమా మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షుడు శిఘాకొల్లి సత్యనారాయణ, సెక్రటరీ పబ్బిశెట్టి ఆంజనేయులు, కమిటీ సభ్యులు వేడుకలను పర్యవేక్షించారు. అనంతరం వందలాది మందికి అన్నదానం చేశారు. అన్నదాన వేడుకలకు దాతలుగా పారిశ్రామికవేత్త మట్టా వెంకట మురళీకృష్ణ, మునగా మారుతీరావు వ్యవహరించారు.

భక్తిశ్రద్ధలతో గణపతి పరిణయం

ఒంగోలు మెట్రో: గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం తొమ్మిదో రోజు ఒంగోలు శ్రీనగర్ కాలనీ మొదటి వీధిలో శ్రీ విజయ గణపతి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సిద్ధి బుద్ధి విజయ గణపతి కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా జరిపించారు. స్థానిక భక్తులు పాల్గొన్నారు.



బై బై గణనాథా..!

గణనాథుని నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురువారం తొమ్మిదో రోజు కావడంతో అధిక సంఖ్యలో విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. కొత్తపట్నం సముద్ర తీరం గణపయ్య విగ్రహాల నిమజ్జనోత్సవాలతో కోలాహలంగా మారింది. విగ్రహాలు బారులుదీరాయి. భక్తులతో తీరప్రాంతం కిక్కిరిసింది. ముందుగా డీజే మ్యూజిక్‌లు, నృత్యాలు, గులాములతో భారీ ఊరేగింపులు నిర్వహించారు. సముద్ర తీరంలో పూజలు చేసి నీటిలో నిమజ్జనం చేసి గణనాథులకు వీడ్కోలు పలికారు.

– సాక్షి, ఒంగోలు



















కూటమి పాలనంతా వంచనే



నందిపాడులో మాట్లాడుతున్న మాజీ మంత్రి మేరుగు

- సంక్షేమం ఇవ్వలేక అక్రమ అరెస్టులు, నిర్బంధాలు
- మాజీ మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: కూటమి ప్రభుత్వ ఏడాదిన్నర పాలనంతా మోసాలతోనే సాగిందని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. గురువారం నందిపాడులో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరకొర హామీలు అమలు చేసి మిగిలిన హామీలను చేయలేక వైఎస్సార్ సీపీ నేతలను అక్రమంగా అరెస్టులు చేస్తూ ప్రజల చూపు మరల్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఐదేళ్ల పారదర్శకంగా అందిన సంక్షేమ పాలనను గుర్తు చేసుకుంటూ ప్రజలు కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలకు దిగుతున్నారని, వారిని భయపెట్టేందుకు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటి వరకు ఇచ్చిన గ్యాస్, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు పథకాల్లో ఎంతోమంది అర్హులకు అన్యాయం జరిగిందన్నారు. మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, నందిపాడు సర్పంచ్ మద్దినేని అరుణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్దినేని శ్రీకాంత్, అన్వేష్, కంకణాల సురేష్, పైనం శ్రీనివాసరావు, రాయపాటి విల్సన్, నాదెండ్ల మహేష్, అద్దంకి శ్రీకాంత్, రెబ్బవరపు దావీదు, మేడికొండ సుబ్బారావు, పోలినేని వెంకట్రావు, పులిపాటి కిరణ్‌బాబు, మేడికొండ సుబ్బారావు, జ్యోతి బాలకోటయ్య, మద్దినేని చెంచయ్య, మేడికొండ చినబాబు, శ్రీను, సతీష్, కృపారావు, సురేంద్ర, సాంబయ్య, అంజయ్య పాల్గొన్నారు.

బండ్లమూడిలో గణపతికి ప్రత్యేక పూజలు



బండ్లమూడిలో గణపతి నిమజ్జనంలో ఎమ్మెల్యే బూచేపల్లి



వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి

చీమకుర్తి రూరల్: మండలంలోని బండ్లమూడిలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం రాత్రి గణపతి నిమజ్జన కార్యక్రమంలో భాగంగా పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొని టెంకాయలు కొట్టి గణపతి నిమజ్జనం ప్రారంభించారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు యన్నం శేషరెడ్డి ఎంపీటీసీ విజయలక్ష్మి, గోపిరెడ్డి బాలవెంకారెడ్డి, ఓబులరెడ్డి, వి.బ్రహ్మారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, నారాయణరెడ్డి, మాగులూరి ఇమ్మానేలు పాల్గొన్నారు


కమలా వెస్లీకి జూపూడి నివాళి



కమలా వెస్లీకి నివాళులర్పిస్తున్న జూపూడి ప్రభాకర్

ఒంగోలు టౌన్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వద్ద సీఎస్‌ఓగా విధులు నిర్వర్తిస్తూ ఆయనతో పాటు హెలికాప్టర్‌లో ప్రయాణిస్తూ ప్రమాదంలో మరణించిన ఐపీఎస్ ఆఫీసర్ అద్దంకి జాన్ కేరి వెస్లీ మాతృమూర్తి కమలా వెస్లీ మృతదేహానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకరరావు గురువారం ఒంగోలులో నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని పరామర్శించారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఒంగోలు వచ్చి కమలా వెస్లీకి నివాళులర్పించినట్లు తెలిపారు. జాన్ కేరి వెస్లీ హెలికాప్టర్ దుర్ఘటనలో మరణించిన రోజే కమలా వెస్లీ తన కుమారుడిని తలచుకుంటూ కన్నుమూశారని, ఆమె మృతి ఆ కుటుంబానికి తీరనిలోటని అన్నారు.

క్విస్ కళాశాలకు ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్



ర్యాంకింగ్ పత్రంతో క్విస్ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు

ఒంగోలు సిటీ: ఉన్నత విద్యాసంస్థల (ఎన్‌ఐఆర్‌ఎఫ్) ర్యాంకింగ్‌లో స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కళాశాల వరుసగా నాలుగోసారి సత్తాచాటింది. కేంద్ర విద్యాశాఖ గురువారం విడుదల చేసిన ర్యాంకింగ్స్ జాబితాలో క్విస్ ఇంజినీరింగ్ కళాశాల జాతీయస్థాయిలో 201 – 300 బ్యాండ్‌లో నిలిచినట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీ గాయత్రి తెలిపారు. టీచింగ్, లెర్నింగ్, రీసెర్చ్ అండ్ ప్రొఫెషనల్ ప్రాక్టీస్, గ్రాడ్యుయేషన్ ఔట్ కమ్, క్వాలిటీ ఆఫ్ ఫ్యాకల్టీ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర విద్యాశాఖ ఈ ర్యాంకులు కేటాయిస్తుంది. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రీసెర్చ్‌లో కూడా అద్భుతమైన శిక్షణ క్విస్ కళాశాల ఇస్తుందని సూర్యకల్యాణ్ చక్రవర్తి అన్నారు. ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్‌లో వరుసగా చోటుదక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. క్విస్ కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న ప్రత్యేక ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ శిక్షణ, రీసెర్చ్ వర్క్ తదితర అంశాలకుగానూ రాష్ట్రస్థాయిలో ఎన్నో అవార్డులు పొంది ఉత్తమ కళాశాలగా నిలిచిందని ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.హనుమంతరావు తెలిపారు.

ఉపాధ్యాయుల పాత్ర ప్రశంసనీయం

- ఏకేయూ వీసీ ప్రొఫెసర్ మూర్తి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏకేయూ వీసీ మూర్తి

ఒంగోలు సిటీ: సనాతన కాలం నుంచి సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుని పాత్ర ప్రశంసనీయమైనదని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి అన్నారు. భారతదేశ మొదటి ఉప రాష్ట్రపతి, రెండో రాష్ట్రపతిగా పనిచేసిన ఉన్నత విద్యావంతులు, తాత్వికవేత్త, ఆంధ్రా యూనివర్సిటీ మాజీ ఉప కులపతి ప్రొఫెసర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 138వ జయంతి సందర్భంగా స్థానిక ఆంధ్రకేసరి యూనివర్సిటీ సమావేశపు హాలులో గురువారం ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.నిర్మలామణి అధ్యక్షత వహించగా, వీసీ మూర్తి మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్, అరవింద్ ఘోష్ లాంటి మేధావులు, విద్యావేత్తలు, తాత్వికవేత్తలు ఆనాటి కాలంలో విద్యాభివృద్ధికి, తద్వారా సమాజాభివృద్ధికి ఎంతగానో సేవలు అందించడం జరిగిందన్నారు. మారిన కాలానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. ప్రస్తుతం భారతావనిలో విద్యా విధానం అంతా నూతన జాతీయ విద్యా విధానం (ఎన్.ఈ.పి–2020)కు అనుగుణంగా జరుగుతోందని తెలిపారు. ప్రిన్సిపాల్ నిర్మలామణి మాట్లాడుతూ నేటి విద్యా విధానంలో ఉపాధ్యాయ లోకం గర్వించదగిన వ్యక్తి, మహనీయులు ప్రొఫెసర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని కొనియాడారు. ప్రొఫెసర్ రాజమోహన్‌రావు, ప్రొఫెసర్ సోమశేఖర, డాక్టర్ మండే హర్షప్రీతం దేవ్ కుమార్, డాక్టర్ ఉబ్బా ఈతముక్కల, కెమిస్ట్రీ విభాగం విద్యార్థిని కావ్య తదితరులు తమ ప్రసంగాలలో ప్రొఫెసర్ రాధాకృష్ణన్ విద్యారంగానికి చేసిన సేవలను కొనియాడారు. ముందుగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వీసీ మూర్తిని సన్మానించారు. కార్యక్రమంలో డీన్ అకడమిక్స్ డాక్టర్ కే గంగాధర్, ఎంబీఏ హెడ్ డాక్టర్ బి.పద్మజ, సోషల్ వర్క్ హెడ్ డాక్టర్ పిల్లి వెంకట్రావు, ఎన్.ఎస్.ఎస్ విభాగం కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతం దేవ్ కుమార్, ఐక్యూ ఏసీ అసిస్టెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఏ అమృతవల్లిదేవి, సీడీసీ విభాగం పూర్వ డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి, బోధనేతర సిబ్బంది, పలు విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌ఎన్‌లో సైబర్ నేరాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హేమంత్, రియాజ్

ఒంగోలు సిటీ: స్థానిక మంగమూరు రోడ్డులోని ఎస్‌ఎస్‌ఎన్ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల డైరెక్టరు వై.సత్యనారాయణరెడ్డి, టి.హేమంత్, ఎస్కే రియాజ్ పాల్గొని మాట్లాడారు. కంప్యూటర్లు, నెట్‌వర్క్, డిజిటల్ పరికరాలను ఉపయోగించి డబ్బు సంపాదించడం, వ్యక్తులు, సంస్థల సమాచారాన్ని దొంగిలించడం, ప్రైవసీని ఉల్లంఘించడం వంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయని, వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు రాజేంద్రబాబు, నీలిమ, రవితేజ, నిరుషా, అధ్యాపకులు జోసఫ్, పూర్ణచంద్రరావు, చిరంజీవి, వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖరరెడ్డి, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సోక్‌పిట్‌లు తక్షణమే పూర్తి చేయాలి

మద్దిపాడు: మండలంలో సోక్‌పిట్లు అన్ని గ్రామాల్లో ఈ నెల 10వ తేదీలోపు పూర్తి చేయాలని ఎంపీడీఓ వి.జ్యోతి ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. ఆమె వెంట ఈఓపీఆర్‌డీ రఘుబాబు, ఈసీ కిషోర్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.